క్లుప్తంగా

పోలమాంబ మండపానికి రూ.25 వేల విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ఏఎంసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు

మాడుగుల: స్థానిక నిర్మలా కాలనీలో వెలసిన పోలమాంబ అమ్మవారు మండప నిర్మాణానికి ఏఎంసీ ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావు రూ.25 వేల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని సోమవారం ఆలయ మండపం నిర్మాణ కమిటీ సభ్యులకు ఇచ్చారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంజూరు చేసిన రూ.6 లక్షలతో మండపం నిర్మించారు. ఇంకా నిధులు చాలకపోవడంతో అమ్మవారి భక్తులతోపాటు దాతలు మండప నిర్మాణానికి విరాళాలు అందజేయాలని కోరారు.

సాగు విధానంపై అవగాహన



సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

చీడికాడ: సాంప్రదాయ వ్యవసాయం, ఆధునిక సాగుపై రైతులకు అవగాహన అవసరమని శ్రీకాకుళం నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు తెలిపారు. సోమవారం వారు ఖండివరంలో గ్రామీణ వ్యవసాయం, వనరులుపై సమస్యల చెట్టు చిత్రం ద్వారా రైతులకు వివరించారు. సాగు విధానంపై అవగాహన కల్పించారు.

ఎన్నికల పరిశీలకుడిని కలిసిన పార్టీ నేతలు



విప్ ధర్మశ్రీతో కలిసి విశ్వనాథంతో మండల నాయకులు

బుచ్చెయ్యపేట: వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బొడ్డేటి కాశీ విశ్వనాథంను పార్టీ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మరిశా నాని, సర్పంచ్‌లు పడాల నాగభూషణం నాయకులు గుడాల ఆనంద్, గుద్దేటి శ్రీను, పడాల రవి కుమార్,సోమవారం చోడవరంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి కాశీ విశ్వనాథంకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. చోడవరం అభ్యర్థి ధర్మశ్రీ విజయానికి సమష్టిగా పనిచేద్దామని కాశీ విశ్వనాథం సూచించారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



కేంద్ర సాయుధ బలగాల కవాతు

నర్సీపట్నం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని టౌన్ సీఐ కాంతి కుమార్ పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. పోలీసు స్టేషన్ నుంచి అబిద్‌సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదగా పెదబొడ్డేపల్లి వరకు ఈ కవాతు కొనసాగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల్లో ధైర్యం కల్పించేందుకు కవాతు నిర్వహించామన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలన్నారు. టౌన్ ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వినాయక తీర్థం

కె.కోటపాడు: గొండుపాలెం శివారు మురుగుపాలెంలో వినాయక తీర్థం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఇక్కడ ఆలయంలో స్వామి వారికి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ధర్మశ్రీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

- అభిమానుల కోలాహలం మధ్య ప్రారంభం
- అడుగడుగునా మహిళలు హారతులతో నీరాజనం
- అంబేరుపురంలో ఇంటింటికీ తిరిగిన విప్



అంబేరుపురంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



ధర్మశ్రీకి పూలమాల వేసి హారతులతో నీరాజనం పలుకుతున్న మహిళలు

చోడవరం: పార్టీ శ్రేణులు, అభిమానుల కోలాహలం మధ్య వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఎన్నికల ప్రచారాన్ని సోమవారం ప్రారంభించారు. తొలుత అంబేరుపురంలో అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన నాయకులతోపాటు గోవాడ, అంబేరుపురం గ్రామాల నుంచి తరలివచ్చిన జన సందోహం మధ్య ఎంతో ఉత్సాహంగా ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరించారు. మెయిన్ రోడ్డు మీదుగా ప్రారంభించిన ప్రచారం పలు వీధుల్లో సాగింది. ప్రతి ఇంటికీ వెళ్లి అక్కా.. చెల్లి, అమ్మా.. తమ్ముడు, అన్నా.. అంటూ ఆప్యాయత పలకరింపుల మధ్య తొలి రోజు ప్రచారం ఎంతో ఉత్సాహంగా జరిగింది. ప్రతి ఇంటికీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో తమ ఇంటికి వచ్చిన ధర్మశ్రీకి మహిళలు హారతులతో నీరాజనం పలికారు. జై జగన్...జై ధర్మశ్రీ అంటూ పార్టీ కార్యకర్తలు, మహిళలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి, రైతులను ఆదుకునేందుకు అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి అనేక సార్లు గ్రాంట్‌గా కోట్లాది రూపాయలు ఇచ్చి ఆదుకున్నారన్నారు. ప్రతీ ఇంటికి ప్రభుత్వం తరపున ఎంతో కొంత మేలు చేసినది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని అన్నారు. రైతు భరోసాతో రైతులను ఆదుకున్నామన్నారు. డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు ఆసరా, సున్నావడ్డీ, చేయూత వంటి పథకాలతో సాయం చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. అనంతరం చోడవరం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రచారంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, ఎంపీపీ గాడి కాసు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, మండల సేవాదళ్ అధ్యక్షుడు సూరిశెట్టి నాగ దుర్గ గోవింద, ఎంపీటీసీ శరగడం నాగేశ్వరరావు, సర్పంచ్‌లు కార్లె ఈశ్వరమ్మ, మొల్లి ఈశ్వరరావు, దంతులూరి శ్రీనువాసరాజు, పార్టీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డేడ సూర్యనారాయణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య పాల్గొన్నారు. నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

టీడీపీలో వైఎస్సార్‌సీపీ నాయకుల చేరిక అవాస్తవం



మాట్లాడుతున్న కోరుకొండ చెల్లంనాయుడు

మాడుగుల: పోతనపూడి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినట్టు ఎల్లో మీడియాలో వచ్చిన వార్తలను వీరవల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోరుకొండ చెల్లంనాయుడు ఖండించారు. పంచాయతీ పరిధి పెంటయ్యపాలెంలో పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆయన మాట్లాడారు. పంచాయతీకి చెందిన తమ నాయకులు కోన శ్రీను, అప్పికొండ సురేష్, కోరుకొండ శివాజీ టీడీపీలో చేరలేదన్నారు. పెంటయ్యపాలెంలో కృష్ణుడు గుడికి విరాళం అందజేస్తామని కొంతమంది టీడీపీ నాయకులు పిలిస్తే వెళ్లారన్నారు. దాన్ని టీడీపీలో చేరినట్టు ప్రచారం చేసుకోవడం తగదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీను, సురేష్, శివాజీ మాట్లాడుతూ తాము టీడీపీలో చేరలేదన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు కోరుకొండ సత్తిబాబు, ధర్మిశెట్టి మహేష్, బూత్ కమిటీ నాయకులు బంటు బుచ్చిబాబు, మెలిపాక పైడినాయుడు, వార్డు మెంబరు ముచ్చకర్ల రాము, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ మొల్లి బుచ్చి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు ఆహ్వానం

దేవరాపల్లి: కేజేపురంలో గంగాదేవి తల్లి గావు పండగ, కె.కోటపాడు మండలం మేడిచర్లలో పోలిపల్లి తీర్థ మహోత్సవానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు ఆహ్వానం పలికారు. ఈ రెండు గ్రామాల పెద్దలు తారువ క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. మంగళవారం వీటిని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

టీడీపీ వారికే కండువాలు కప్పి ప్రచారం

మాడుగుల రూరల్: ముకుందపురం గ్రామానికి చెందిన నలుగురు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరడం అవాస్తవమని సర్పంచ్ కర్రి గణేశ్, పార్టీ నాయకుడు బాలిబోయిన కాశీ తెలిపారు. సోమవారం మాడుగులలోని టీడీపీ సమావేశంలో తమ గ్రామానికి చెందిన కర్రి పైడితల్లినాయుడు, బాలిబోయిన రాంబాబు, మెల్లి కోటి, ఎలిశెట్టి రాంబాబు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరడం వాస్తవం కాదన్నారు. వీరంతా టీడీపీ వారేనని, మరలా పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గృహసారథి కర్రి వరహాలురాజు తమ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారని స్పష్టం చేశారు.

ప్రసవాల సంఖ్య పెరగాలి

- అదనపు డీఎంహెచ్‌వో బాలాజీ



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో బాలాజీ

నర్సీపట్నం: ప్రసవాల సంఖ్య పెంచాలని అదనపు డీఎంహెచ్‌వో బాలాజీ వైద్య సిబ్బందికి సూచించారు. వేములపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ ప్రసవాల గురించి అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా ప్రసవాలు చేయాలని, లేని పక్షంలో చర్యలు తీసుకోవాల్సి వస్తోందని సిబ్బందిని హెచ్చరించారు. కనీసం నెలలో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదు ప్రసవాలు చేయించాలన్నారు. డెలివరీ అయి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యేలోపు పీఎంఎంఈవై నిధులు వారి ఖాతాలో జమయ్యేలా చూడాలన్నారు. అనంతరం వివిధ విభాగాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు.

హోలీ.. రంగుల కేళి



కె.కోటపాడు: పాతవలసలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు



గొలుగొండ: ఏటిగైరంపేటలో చిన్నారులకు రంగులు అందిస్తున్న దృశ్యం



కె.కోటపాడు: ఎ.భీమవరంలో హోలీ వేడుకల్లో చిన్నారుల సందడి

నర్సీపట్నం/మాకవరపాలెం/రావికమతం/గొలుగొండ/కె.కోటపాడు/మాడుగుల రూరల్: హోలీ సంబరాలను సోమవారం నర్సీపట్నం మున్సిపల్ స్టేడియంలో ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అంతా రంగులు చల్లుకుంటూ డాన్స్‌తో కేరింతలు కొట్టారు. నింజాస్ అకాడమీలో బాక్సింగ్ క్రీడాకారులు సందడి చేశారు. ఈ వేడుకల్లో అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్లు సుమల, శ్రావణ్ పాల్గొన్నారు. మాకవరపాలెంలో అన్‌రాక్ కార్మికులు, అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు హోలీ పండగలో పాల్గొన్నారు. రావికమతం, కొత్తకోట గ్రామాల్లో మార్వాడీలు, ఎలక్ట్రికల్ ప్లంబర్స్ యూనియన్ సభ్యులు కన్నారావు, చందు, గుమాన్‌సింగ్ రంగులు చల్లుకుంటూ రోడ్లపై కేరింతలు కొట్టారు. మిఠాయిలు పంచిపెట్టారు. గొలుగొండ మండలం ఏటిగైరంపేటలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు రంగులు అందించారు. క్లబ్ సభ్యులు వెంకటలక్ష్మి, భాగ్యలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు. కె.కోటపాడు, మాడుగుల మండలాల్లో ఈ వేడుక నిర్వహించారు.

వైభవంగా ముగిసిన దేవీపెద్దింటమ్మ ఉత్సవాలు



గ్రామవీధిలో విద్యుత్తు అలంకరణ



అమ్మవారి పల్లకి సేవలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



వీక్షకులను అలరించిన నృత్యాలు

- అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: ఈ నెల 20న ప్రారంభమైన దేవీ పెద్దింటమ్మ ఉత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవం సందర్భంగా గ్రామ వీధులను రంగురంగుల విద్యుత్తు బల్బులతో తీర్చిదిద్దారు. సాయంత్రం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ చిడతలు, కోలాటం, భజన పోటీలు నిర్వహించారు. ఆ తర్వాత గ్రామ వీధుల్లో సినీ నటుల డూపు డ్యాన్స్, రేలారేరెలా ఆర్కెస్ట్రా, నృత్య ప్రదర్శనతోపాటు స్టేజ్ ప్రోగ్రాలు ప్రదర్శించారు. రాత్రి తొమ్మిది గంటల తర్వాత పలు వీధుల్లో నేల డ్యాన్సులు, సన్నాయి మేళాలు, మిరుమిట్లు గొలిపే బాణసంచా పేలుళ్ల మధ్య అమ్మవారు రథం ఊరేగించారు. ఈ రథాన్ని లాగేందుకు పెద్ద ఎత్తున భక్తులు పోటీ పడ్డారు. ఈ రథయాత్రలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, కొప్పుల వెలమ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ టి.వి. రమణ, సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సబ్బవరపు పెద్ది నాయుడు పాల్గొన్నారు. ఎస్సై ఎల్ సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షేమాభివృద్ధే విజయానికి దిక్సూచి



పి.జగ్గంపేటలో ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

నాతవరం: వైఎస్సార్‌సీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమా శంకర్ గణేష్ తలపెట్టిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. మండలంలో తొలిసారిగా పి.జగ్గంపేట నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించారు. తొలుత ఉదయం 11 గంటలకు స్థానిక కనకదుర్గమ్మ తల్లి గుడిలో పూజలు చేసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు మహిళలు హారతులిచ్చి నుదట తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పొందిన మేలు స్వయంగా లబ్ధిదారులు చెప్పడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ‘మళ్లీ మీరే రావాలి’ అంటూ రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులు ఎమ్మెల్యే వెంట నడిచి మరింత ఉత్సాహన్ని నింపారు. గతంలో ఇక్కడ నిర్వహించిన కార్యక్రమాలతో పోల్చుకుంటే ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి ఊహించని విధంగా ఆదరణ లభించడంతో పార్టీ క్యాడర్‌లో మరింత జోష్ కనిపించింది. గ్రామంలో అన్ని వీధుల్లో ఇంటింటికెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే క్షుప్తంగా వివరించారు. మరలా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు వస్తాయన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశానని, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించామన్నారు. మరలా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు, పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, తలుపులమ్మ తల్లి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ లాలం బాబ్జి, గన్నవరం, పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు గొర్లె వరహాలబాబు, అచ్చెర్ల వరహాలబాబు, పార్టీ యూత్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఏకా శివ, సర్పంచ్ జి.వి.రెడ్డి సోమ్మన్నదొర, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు శిరుసుపల్లి నర్సింగరావు, పామాయిల్ కార్పొరేషన్ పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, పార్టీ నాయకుడు నాగు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు నాగాపురంలో..

గొలుగొండ: నాగాపురంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంగళవారం ఉదయం 9గంటలకు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తెలిపారు. ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మోసపూరిత చంద్రబాబు, అయ్యన్న మాటలు నమ్మొద్దు

ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోని మరలా మోసం చేసేందుకు చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి సీహెచ్. అయ్యన్నపాత్రుడు వస్తున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ హెచ్చరించారు. 2014లో 600 హామీలిచ్చి అమలు చేయలేని అసమర్థులని విమర్శించారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేయకుండా తడిసి మోపెడు చేశారని, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తానని దగా చేశారని దుయ్యబట్టారు. అన్ని వర్గాల వారిని మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. హామీలను అమలు చేయకుండా ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడగటానికి వస్తున్నారని విమర్శించారు. నర్సీపట్నంలో మిగతా రోజుల్లో క్యాంటీన్ పెట్టకుండా ఇటీవల ఎన్నికల కోసం ఏర్పాటు చేశారని అయ్యన్నపై ధ్వజమెత్తారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభలతో టీడీపీ, జనసేన పార్టీలకు మైండ్‌బ్లాక్ అయిందన్నారు. ఏ నోటా విన్నా మరలా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటునే ఇంటి దరికే సంక్షేమ పథకాలు వస్తాయని ప్రచారం జరుగుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు లేనిపోనీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు.

వడ్డాది వెంకన్న ఉత్సవాలు విజయవంతం



ఉత్సవాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన సీఐ అప్పనాయుడు



ఉత్సవాలకు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

- గొడవలకు తావివ్వకుండా పోలీసు బందోబస్తు
- కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు, అధికారులు

బుచ్చెయ్యపేట: ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో ఎటువంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు 151వ కల్యాణ మహోత్సవాలు జరిగాయి. కోరిన కోర్కెలు తీర్చే వడ్డాది వెంకన్నగా పేరొందడంతో ఏటా రాష్ట్రం నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఏడాది ఉత్సవాలకు రెండు నెలల ముందు వడ్డాదిలో రెండు వర్గాలకు చెందిన యువకులు మధ్య గొడవలు జరిగాయి. దీంతో వడ్డాది ప్రజలతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు కల్యాణ మహోత్సవాల నిర్వహణపై ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డాది ఉత్సవాల్లో గొడవలు జరగొచ్చని ఇంటెలిజెన్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పది రోజుల పాటు గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. దేవస్థానం అధికారులతోపాటు వంశపారంపర్య ధర్మకర్తలి మండలి, గ్రామ పెద్దలు ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వెనుకంజ వేశారు. ఏటా ఐదు రోజులు ఆలయం దిగువన రోజుకొక సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది ఆ ఊసెత్తలేదు. కొత్తకోట సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ ఈశ్వరరావు పర్యవేక్షణలో వంద మంది పోలీసులతో ఆలయం వద్ద, నాల్గు రోడ్ల జంక్షన్, కొండ దిగువన భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ మురళీకృష్ణ, డీఎస్పీ అప్పలరాజు పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆఖరి రోజు ఆదివారం వేంకటేశ్వరస్వామి నాగవల్లి వసంతోత్సవం, తిరువీధి ఉత్సవంలో రోప్ పార్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో ఉత్సవాలు ప్రశాంతంగా ముగయడంతో వడ్డాది ప్రజలతోపాటు భక్తులు, నాయకులు, అధికారులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక యువతి ఆత్మహత్య

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

చోడవరం రూరల్: వెంకన్నపాలెం గ్రామానికి చెందిన నంబారు వరలక్ష్మి సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి నంబారు గున్నమ్మ చోడవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ బి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. గున్నమ్మకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మూడో కుమార్తె వరలక్ష్మి సాయంత్రం తనకు తీవ్రమైన కడుపునొప్పి వస్తుందని తన తల్లికి చెప్పింది. దాంతో మాత్రల కోసం వెంకన్నపాలెం జంక్షన్‌కు వచ్చి అక్కడ లభించకపోవడంతో చోడవరానికి వెళ్లి సంబంధిత మాత్రలతో ఇంటికి చేరుకునే సరికే కుమార్తె తన చున్నీతో ఫ్యానుకు ఉరేసుకుంది. దీంతో ఇరుగు పొరుగువారి సహాయంతో చోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు డాక్టర్ నిర్ధారించారు. గున్నమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

నేడు సంపత్ వినాయక వార్షికోత్సవం

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో సంపత్ వినాయక ఆలయ 12వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించడానికి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ట రేపు

మాడుగుల రూరల్: తాటిపర్తిలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారి విగ్రహాలకు తిరువీధి ఉత్సవం, అనంతరం ఆలయంలో గణపతి పూజ, రక్షాబంధన్ నవగ్రహ మండపారాధన, తదితర కార్యక్రమాలతోపాటు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రచారం

మాడుగుల రూరల్: తమ ప్రభుత్వం రాష్ట్రం అధికారంలోకి వస్తే పలు సంక్షేమ పథకాలు అమలు చేయనుందని పీసీసీ కార్యదర్శి పడాల కొండలరావు తెలిపారు. ఇంటింటికీ కాంగ్రెసు పార్టీ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి కె.జె.పురం శివారు తెలకలదీపంలో ప్రచారం చేశారు. కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలు గురించి వివరించారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ బుడబండి రాజు, యూత్ కన్వీనర్ ఏసురాజు, నాయకులు రాపేట సత్యనారాయణ పాల్గొన్నారు.